క్లుప్తంగా

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

నవాబ్‌పేట: పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఈ విషయంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..మండలంలోని 45 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బీఎల్‌ఓలు,సూపర్‌వైజర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జిల్లా అధికారుల ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు వివరించారు.కాగా ఈ శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో గురు వారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులేదని, అందరూ విధిగా హాజరుకావాలని సూచించారు.

ఏఓ సువర్ణరాజ్‌కు సన్మానం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కలెక్టరేట్‌లో ఏఓగా బాధ్యతలు స్వీకరించిన సువర్ణరాజ్‌ను దళిత సంఘాల నాయకులు బుధవారం తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఆయన ఎల్లప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ చంద్రశేఖర్, దళిత సంఘాల నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, బహుజన మహనీయుల శోభాయాత్ర కోఆర్డినేటర్ పాతూర్ రమేశ్, కాలే నరేందర్, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎన్నిక



స్టేషన్ మహబూబ్‌నగర్: రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ టీఎస్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ఎంఎస్ విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. గతంలో ఈయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. తనకు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శానమోని నర్సింహులు, శౌయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పండిత పరిషత్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలి



చిన్నచింతకుంట: రైతులు వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ రైతులకు సూచించారు. బుధవారం చిన్నచింతకుంట మండలం అల్లీపురంలో రైతు కృష్ణయ్య తెచ్చిన నూతన డ్రోన్ స్ప్రేకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాగు పద్ధతిలో రైతులు వ్యవసాయాన్ని అలవర్చుకోవాలన్నారు. అలాగే ఆధునిక యంత్రాలను వినియోగించి పనులను సులభంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ఉన్నారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలోని ఎంఈడీ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన వినోద్‌కుమార్ కుటుంబానికి బీఈడీ కళాశాలల యాజమాన్యం తరఫున ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు అధ్యాపకులు, యాజమాన్యాలు మొత్తంగా రూ. 1.21లక్షలను జమ చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. వినోద్ యూనివర్సిటీకి చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తనదైన పాత్ర పోషించారని, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహ్మద్, రాజశేఖర్, గంగాధర్‌చారి, శర్మ, ఎంఈడీ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపులు

మహమ్మదాబాద్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ తెలిపారు. బుధవారం మండలంలోని సంగాయపల్లి తండాలో గిరిజనుల సామాజిక అభివృద్ధికి అమలు చేస్తున్న పీఎం దర్తి అభాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎల్‌డీఎమ్ భాస్కర్, మహమ్మదాబాద్ మేనేజర్ రవీందర్, కార్యదర్శి కీర్తి పాల్గొన్నారు.

రక్షణ‘కంచె’కరువు

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- ప్రమాదాలబారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



ఎన్మన్‌గండ్ల బాలుర హాస్టల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



నవాబ్‌పేట బస్టాండ్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్

నవాబ్‌పేట: మండలంలో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన నియంత్రికలు ప్రమాదాలకు నిలయాలుగా మారియి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయకుండా వదిలేయడంతో మూగజీవాలు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా మండలంలోని ఎన్మన్‌గండ్ల ప్రభుత్వ బాలుర హాస్టల్ ప్రహరీకి ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే హాస్టల్ విద్యార్థులు ఆడుకునే గ్రౌండ్ కూడా ఉన్నది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. అలాగే మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలోని బస్టాండు రోడ్డుకు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సైతం ప్రమాదంగా కనిపిస్తుంది. గతంలో దిమ్మెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పిల్లర్ వేసి ఏర్పాటు చేసినా దానికి కంచ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇలా మండలంలో ప్రమాదభరితంగా చాలా ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదానికి సంకేతాలుగా ఉన్నాయి. ఇలాంటి వాటికి కంచెలు ఏర్పాటు చేయడంతోపాటు వెంటనే తొలగించి ప్రమాదాలు జరగకముందే వాటిని సరిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

‘ఎంబీ రికార్డు’పై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



పీఆర్ ఎస్‌ఈ విజయకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ నుంచి మూసాపేట మండలం దాసర్‌పల్లికి వెళ్లే రోడ్డుపై వేసిన మట్టికి ఇటీవల అధికారులు ఎంబీ రికార్డు చేయడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. గ్రామానికి సమీపంలో స్నేహ చికెన్ పరిశ్రమ నిర్వాహకులు కోళ్ల ఫారాలను నిర్మించారు. పొన్నకల్ ఊరి మధ్యలోంచి అక్కడికి వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో ఊరి బయటి నుంచి కొత్తగా బైపాస్ దారి ఏర్పాటు వేశారు. ఈ క్రమంలో పొన్నకల్ నుంచి దాసర్‌పల్లి వైపు వెళ్లే రోడ్డుపై ఉన్న గుంతల్లో కూడా మట్టిని వేయించాలని గ్రామస్తులు కోరారు. దీంతో సదరు కంపెనీ ద్వారా రోడ్డుపై మట్టిని వేయించారు. అయితే దీనిపై ఇటీవల కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ అధికారులతో రూ.2లక్షలకు ఎంబీ రికార్డు చేయించుకున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు విజయకుమార్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహారెడ్డి, రంజిత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ విజయకుమార్‌ను కలిశారు. ఎంబీ రికార్డు చేయడంపై ఏఈ, డీఈలకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఫిర్యాదు అందజేశారు. కంపెనీ తరఫున రోడ్డుపై వేసిన మట్టికి అధికారులు చేసిన ఎంబీ రికార్డుపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా ఇదే అంశంపై పంచాయతీ రాజ్ డీఈ లక్ష్మణ్‌గౌడ్‌ను సంప్రదించగా నిబంధనల మేరకే రోడ్డు పనులపై ఎంబీ రికార్డు చేసినట్లు తెలిపారు.

కనీస సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



మిడ్జిల్: గిరిజనుల కనీస సౌకర్యాలు గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడం కోసం కేంద్ర ప్రభుత్వం జన జాతీయ గౌరవ వర్ష్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ గీతాంజలి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మంగళిగడ్డ తండాలో ధర్తి ఆబా జనభాగిదారి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి కావాల్సిన సౌకర్యాలను గుర్తించారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి వారి సమస్యలను గుర్తించి నివేదికలు సమర్పించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో రెవెన్యూ ఆరోగ్య, వ్యవసాయ శాఖలతోపాటు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: వచ్చేవారంలోగా మండలంలో పెండింగ్‌లో ఉన్న సోషల్ ఆడిట్ సమస్యలన్నీ పరిష్కారం కావాలని డీఆర్‌డీఏ ఏపీడీ ప్రేమలత ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ చాంబర్‌లో ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా 12, 13, 14 సోషల్ ఆడిట్‌లకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న అన్ని సమసల్యు పరిష్కారం కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలకు వేసిన పెనాల్టీ చెల్లింపులు, అందిన ఫిర్యాదులకు వివరణలు ఇవ్వడం వంటి వాటిని వెంటనే పూర్తిచేయాలన్నారు. వచ్చేనెలలో కేంద్ర బృందం పర్యటించనుందని, అందుకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉంచాలని, పనుల వద్ద బోర్డుల ఏర్పాటు ఉండాలని, లేనట్లయితే వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓ చాంబర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నవాబ్‌పేట: ఇంటి దగ్గర ఉన్న యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో నుంచి చెప్పకుండ వెళ్లిపోయింది. దీంతో బంధువుల చెంత, స్నేహితుల చెంత వెతికినా లాభం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన వివరాలిలా.. మండలంలోని ఇప్పటూర్‌కు చెందిన ఓ యువతి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల చెంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం యువతి తండ్రి గుర్రం సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువతి అదృశ్యానికి ఇప్పటూర్ గ్రామానికి చెందిన గున్నల ప్రవీణ్ అనే యువడిపై అనుమానం ఉందని తమకు న్యాయం చేసి తన కూతురుని అప్పగించాలని కోరారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అప్పంపల్లి–చిన్నచింతకుంటకు బస్సు నడిపించండి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి

చిన్నచింతకుంట: అప్పంపల్లి గ్రామం నుంచి కురుమూర్తి స్వామి ఆలయం మీదుగా చిన్నచింతకుంటకు బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సీసీకుంట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నచింతకుంట జూనియర్ కళాశాలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక కళాశాలకు రాలేకపోతున్నారన్నారు. ముఖ్యంగా అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిర్మలాపురం, గూడూర్ విద్యార్థులకు సమయానికి వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందుకు అధికారులు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అప్పంపల్లి నుంచి కురుమూర్తి స్వామి ఆలయం సమీపం మీదుగా చిన్నచింతకుంటకు బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.

6న పూర్వ విద్యార్థుల సమావేశం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో బాదేపల్లి జెడ్పీహైస్కూల్ బాలుర పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈనెల 6న ఆదివారం నిర్వహించనున్నట్లు కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు రవిశంకర్, కృష్ణ, రమణాచార్యులు, ఇబ్రహీం తెలియజేశారు. సమావేశంలో నవంబర్ చివరివారంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి వివిధ కమిటీలు వేయనున్నట్లు వారు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. శతాబ్ది సంబరాల్లో ప్రతి పూర్వ విద్యార్థి భాగస్వామ్యం కావాలని, అందుకు నిర్వహించే సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు త్వరగా చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ధూప, దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర ధూప, దీప నైవేద్య అర్చక సంఘం సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, కుమార స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధూప, దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మను కలిసి అర్చకుల సమస్యలను వివరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని జిల్లా సంఘం తరఫున శాలువాతో సత్కరించారు.



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన జిల్లా ప్రతినిధులు

‘సమ్మెతో కేంద్రం మెడలు వంచుతాం’

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని కేంద్రం మెడలు వంచుతామని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కురుమూర్తి అన్నారు. బుధవారం ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో రైల్వే ఐఎస్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికవర్గం ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బలోపేతంపై ప్రశంసలు

జడ్చర్ల టౌన్: పాఠశాల బలోపేతానికి హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఎంఈఓ మంజులాదేవి అభినందించారు. బుధవారం ఆమె మండలంలోని నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల ప్రార్థనకు హాజరైన ఆమె మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడం అభినందనీయమన్నారు. ఇదేవిధంగా పాఠశాలను ముందుకు తీసుకువెళ్లాలని ప్రశంసించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఇష్టంగా చదివితే బాగా అర్థమవుతాయని భవిష్యత్‌లో ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం తంగెళ్లపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.



విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ

హామీలు అమలు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ యువతకు ఇచ్చిన నిరుద్యోగ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ భానుప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ నాయకులు ప్రవీణ్, భాస్కర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

గండేడ్: గ్రామాల్లో సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించొద్దని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు నెలల సరుకులు అందరికీ సక్రమంగా పంపిణీ చేశారా అని డీలర్లను ప్రశ్నించారు. ప్రతినెలా అన్నిరకాల రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఆయిల్‌పాం సాగు లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్నకలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాకు ఆయిల్ పాం సాగుకు నిర్దేశించిన 1500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ, మండల వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారుల సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్యం సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉద్యానశాఖ, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు నిర్దేశించిన 1500ఎకరాల లక్ష్యానికి ఇప్పటి వరకు 438.50 ఎకరాలు, పరిపాలన మంజూరు చేసి 55ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. ఆయిల్ పాం సాగుపై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షిస్తునట్లు తెలిపారు. ఉద్యాన శాఖలో ఫీల్డ్ సిబ్బంది లేకపోవడంతో ఏఓలు, ఏఈఓ సహాయంతో ఆయిల్ పాం రైతుల గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీపై అవగాహన కల్పించి పంట మార్పిడిగా ఆయిల్ పాం సాగు ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రీ యూనిక్యూ ఆయిల్ పాం కంపెనీ, జోనల్ మేనేజర్, ఏరియా మేనేజర్, ఫీల్డ్ సిబ్బంది, లక్ష్యం సాధించే విధంగా కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వారానికి మూడురోజులు రైతువేదికల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మొక్కలు, డ్రిప్‌కు రైతు వాటా డీడీ రూపంలో కట్టించి, జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉద్యాన శాఖ డీడీ రామలక్ష్మి, ఉద్యాన అధికారి వేణుగోపాల్, డీఏఓ వెంకటేష్, డీఆర్‌డీఓ నర్సింహులు, ఏఓలు, ఏఈఓలు, డివిజన్ ఉద్యాన అధికారులు, ప్రీ యూనిక్యూ ఆయిల్ పాం కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పప్పు దినుసులను సాగు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ వ్యవసాయం: రైతులు పప్పు దినుసుల పంటలు అధికంగా సాగు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు, ఏఈఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ ఆహార భద్రత పథకం సహకారంతో అందించిన కంది పంట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట

భూత్పూర్: రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేస్తూ, కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చుతూనే మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకరావాలనే సంకల్పంతో రాష్ట్రంలోని 65లక్షల మంది డ్వాక్రా మహిళా సంగం సభ్యులకు రూ.కోటి రుణం పెంచాలని, ప్రతిఏటా రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించడం జరుగుతుందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్కూల్ యూనిఫాంల స్టిచ్చింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతను అప్పగించడంతోపాటు ఇందిరా శక్తి పథకంలో భాగంగా పెరటికోళ్ల పెంపకం, డెయిరీ, మిల్స్‌సెంటర్‌ల ఏర్పాటు, పెట్రోల్ బంక్, మహిళా క్యాంటీన్లు తదితర వినూత్న పథకాలతో మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.కోటి రుణానికి సంబంధించిన చెక్కును పంపిణీ చేశారు.



మద్దిగట్ల స్టేజీ వద్ద బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన

మండలంలోని మద్దిగట్ల స్టేజీ నుంచి మద్దిగట్ల గ్రామం వరకు రూ.3కోట్ల58లక్షల వ్యయంతో చేపట్టే బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నూరుల్ నజీబ్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పుల్లయ్య, బోరింగ్ నర్సింహులు, వెంకట్ నారాయణ, రాజేశ్‌గౌడ్, సురేశ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, తమ్మన్నగౌడ్ పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం పేరుతో నీటి వనరులు కాలుష్యం అవుతున్నాయని, తద్వారా జీవకోటికి ముప్పు వాటిల్లుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతి పత్రం సమర్పించారు. విగ్రహాల తయారీలో ప్రాణాంతకమైన కెమికల్స్ సీసం, మెర్క్యురీ, కాడ్మియం వాడకంతో మనుషులతోపాటు జంతు, జీవరాశి ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, నదులు, రిజర్వాయర్లలో నిమజ్జనం చేయడంతో చేపలు మృతిచెందుతున్నాయని, మత్స్య కార్మికుల బతుకులు ఎండమావిగా మారుతున్నాయని వివరించారు. పర్యావరణం సమతుల్యతకు ప్రతిఒక్కరూ పాటుపడేలా వినాయక చవితికి ముందే మట్టి వినాయకులను తయారు చేసి సాధారణమైన కలర్లను వాడేలా అవగాహన కల్పించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా మత్స్యకార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, హన్వాడ మండలం పండుగ సాయన్న కమిటీ ఉపాధ్యక్షుడు బాలు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్

న్యాయం జరిగే వరకు నిర్మాణాలు చేపట్టొద్దు

దేవరకద్ర రూరల్: మాకు న్యాయం జరిగే వరకు కౌకుంట్లలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి అనుమతులు నిలిపివేయలని బుధవారం గ్రామానికి చెందిన నాయకులు, లబ్ధిదారులు తహసీల్దార్ సుందర్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారుల వివరాల ప్రకారం.. 435, 436 సర్వే నెంబర్‌లో 14ఎకరాల భూమిని 1984లో అప్పటి ప్రభుత్వం సేకరించి భూ యజమానలకు పరిహారం అందజేసి, గ్రామంలోని 206మంది పేదలకు ప్లాట్లు ఇచ్చి పట్టాలు అందజేసింది. గతంలోని భూ యజమానులు 2015లో తప్పుడు పత్రాలతో కోర్టు నుంచి ఒక స్టే తీసుకొచ్చి 12ఎకరాల భూమిని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ విషయంపై తమ దగ్గర ఉన్న అధారాలతో కోర్టును ఆశ్రయించామని, ఈ క్రమంలోనే ప్రభుత్వం ఇటీవల గ్రామంలో ఆస్పత్రి నిర్మాణానికి అనుమతులిచ్చిందని, అదే సర్వే నెంబర్‌లోని మిగిలిన భూమిలో నిర్మిస్తామని సమాచా రం అందిందని, మాకు న్యాయం జరిగే వరకు ఆస్పత్రి నిర్మాణం నిలిపివేయాలని కోరారు.

‘కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం’

దేవరకద్ర: కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేక చట్టాలు తెచ్చి కార్పొరేట్లకు అనుకూల చట్టాలను అమలు చేస్తున్నదని ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యాయులు రాము ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ ఆవరణలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షకుల ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు మహబూబ్‌నగర్‌లో జరిగే ఏఐయూకేఎస్ మొదటి మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కృష్ణ, సాంబశివుడు, రాంచందర్, కొండారెడ్డి, యాదగిరి, భగవంతు, నర్సింహులు, శివారెడ్డి, అంజన్న, రాజన్న పాల్గొన్నారు.

వానాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

రాజాపూర్: వర్షాకాలంలో అన్నదాతలు, విద్యుత్ సిబ్బంది కరెంట్‌తో అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజినీర్ చంద్రమౌలి పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ భద్రతావారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నవాబ్‌పేట, రాజాపూర్, బాలానగర్ విద్యుత్ సిబ్బందికి హెల్మెట్, హ్యాండ్‌గ్లౌస్‌లు, ఎర్తరాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ నవీన్‌కుమార్, ఏఈలు వెంకటేశ్, సంతోష్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో మేక మృతి

అడ్డాకుల: మండలంలోని రాచాలలో పుట్టపల్లికి వెళ్లే రోడ్డు పక్కన ఇళ్ల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బుధవారం మేక మృతి చెందింది. గ్రామానికి చెందిన పిల్లి శ్రీను తన మేకలను పుట్టపల్లి రోడ్డు వైపు తీసుకెళ్తుండగా ఓ మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కిందికి ఉన్న కరెంటు తీగను తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఇదిలా ఉండగా గ్రామంలో చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కిందికి ఉన్నాయని, వాటి వద్ద కరెంటు తీగలు కిందికి వేళాడుతూ ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీ వద్ద కొకుంట్లకు వెళ్లే రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.